కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నగోల్కొండ, చౌదరిగూడ, హమీదుల్లానగర్, జూకల్, మదన్‌పల్లి, నానాజీపూర్, నర్కూడ, పాల్మాకుల, పెద్దగోల్కొండ, పెద్దషాపూర్, రామంజాపూర్, రాయన్నగూడ, సుల్తాన్‌పల్లికి చెందిన 53 మందికి రూ.53,06,148 ఆర్థిక సాయం మంజూరైందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎంపీడీఓ మున్నీ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో తేలికపాటి వర్షం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుధవారం రాత్రి 10 నిమిషాల పాటు తేలిక పాటి వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఉపశమనం లభించినట్లయ్యింది.

శంషాబాద్ ఏసీపీగా బాధ్యతల స్వీకరణ



ఏసీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు

శంషాబాద్: శంషాబాద్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీగా శ్రీకాంత్‌గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, ఆర్‌జీఐఏ ఔట్‌పోస్టు సీఐ బాలరాజు నూతన ఏసీపీని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

డీసీఎంను ఢీకొన్న మరో డీసీఎం వ్యాన్

ఒకరి మృతి



శంషాబాద్: ముందు వెళ్తున్న డీసీఎంను వెనక నుంచి మరో డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఔటర్ రింగురోడ్డుపై జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం..కండ్లకోయ నుంచి శంషాబాద్‌కు ఓ డీసీఎం కూరగాయల లోడుతో వెళ్తుంది. కొత్వాల్‌గూడ సమీపంలోకి రాగానే మరో డీసీఎం డ్రైవర్ రాజు అతివేగంతో ముందుగా వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టాడు. దీంతో అందులో ప్రయాణిస్తున్న కండ్లకోయకు చెందిన కల్వ ఐలయ్య (40) కేబిన్‌లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి



అజయ్ (ఫైల్)

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు మృతిచెందిన ఘటన కొత్వాల్‌గూడలో జరిగింది. కొత్వాల్‌గూడ అంజయ్య, సరిత దంపతుల కుమారుడు అజయ్ (13) స్నేహితులతో కలిసి 10 రోజుల క్రితం బైక్‌పై శంషాబాద్ వైపు వెళ్తుండగా పంచవటి పార్కుకు దగ్గరలో వాహనం స్కిడ్ అయి కిందపడిపోయారు. అజయ్ తీవ్రంగా గాయపడగా, మిగితవారు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో అజయ్‌ని ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గంధం రవీందర్‌ముదిరాజ్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ నాయకుడు పూర్ణచందర్ ముదిరాజ్ రూ. 10వేలను మృతుడి తల్లిదండ్రులకు అందజేశారు.

కేశవనగర్‌లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కేశవనగర్‌లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలు, పిచ్చి మొక్కలను తొలగించారు. అంతర్గత రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీనియర్ నాయకులు ఈశ్వర్, తిరుపతి, సుమన్, నగేష్, రాజు, శ్రీనివాస్, యాదయ్య, గోవింద్ పాల్గొన్నారు.

‘మూగ’రోదన..!

రామంజాపూర్ పశు వైద్య ఉపకేంద్రంలో సేవలు అంతంతే



రామంజాపూర్‌లో తాళం వేసి ఉన్న పశు వైద్య ఉపకేంద్రం



వైద్యం అందక చనిపోయిన ఆవు (ఫైల్)

- సరైన వైద్యం అందక పశువులు, జీవాల మృత్యువాత
- పట్టించుకోని సంబంధిత అధికారులు

శంషాబాద్ రూరల్: మండలంలోని రామంజాపూర్ పశు ఆరోగ్య ఉపకేంద్రం అలంకారప్రాయంగా మారింది. సరైన సమయంలో వైద్య సేవలు అందక పశువులు, జీవాలు మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాత భవనంలో ఈ ఉపకేంద్రాన్ని ప్రారంభించగా..ఏడాదిగా సేవలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, ఎప్పుడు చూసినా ఆస్పత్రికి తాళం వేసి ఉంటుందని ఆరోపిస్తున్నారు. ఈ ఆస్పత్రి పరిధిలోని రామంజాపూర్, రామంజాపూర్‌తండా, కవేలిగూడ, బోటిగూడలో చాలామంది రైతులు పాడి పశువులు, జీవాలతో ఉపాధి పొందుతున్నారు. అయితే వాటికి ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. కొందరు వాటికి ఖరీదైన వైద్యం సకాలంలో చేయించలేక పశువులు, జీవాలు చనిపోతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైద్యం అందక ఆవు చనిపోయింది..



నేను వ్యవసాయంతో పాటు ఆవులను పోషిస్తున్నాను. 10 రోజుల కిందట ఆవుకు సుస్తీ చేస్తే రామంజాపూర్ పశు ఆరోగ్య ఉప కేంద్రానికి తీసుకెళ్తే వైద్యులు లేరు. దీంతో ప్రైవేట్‌లో చికిత్స చేయించాను. అయినా ఆవు చనిపోయింది. దాదాపు రూ.లక్షన్నర నష్టం జరిగింది. – చేగూరు మల్లేశ్, రామంజాపూర్

ఎప్పుడూ తాళమే..



ఆవు కాలుకు పుండ్లు అయి నడవడం లేదు. దీంతో రామంజాపూర్ పశు ఆరోగ్య ఉప కేంద్రానికి తీసుకెళ్తే తాళం వేసి ఉంది. సిబ్బందికి ఫోన్ చేస్తే రేపు మాపు అంటూ ఎవరూ రావడం లేదు.

– ముడావత్ టక్యా, రామంజాపూర్‌తండా

ఆర్‌టీఐ కమిషనర్‌కు సన్మానం



దేశాల భూపాల్‌ను సత్కరిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ (ఆర్‌టీఐ) గా నియమితులైన రాజేంద్రనగర్‌కు చెందిన అడ్వొకేట్ దేశాల భూపాల్‌ను ఆయన నివాసంలో పద్మశాలీ సంఘం నాయకులు బుధవారం కలిశారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా భూపాల్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసమే పదవిని వినియోగిస్తానన్నారు. సంఘం నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడు ఏర్వ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కాశీగారి యాదగిరి, దొంత రాజు, ప్రచార కార్యదర్శి రాపోలు సత్తయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి జగదీశ్, రాష్ట్ర నాయకులు బిర్రు రాధాకృష్ణ, కేంచే శ్రీకాంత్, రాజేంద్రనగర్ సర్కిల్ నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



అందిస్తున్న నగేశ్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ, గౌలిదొడ్డి, కేశవనగర్ కాలనీలో నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయానికి వట్టినాగులపల్లి మాజీ ఎంపీటీసీ జి.నగేశ్‌యాదవ్ రూ. లక్ష విరాళాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల చదువులు, వివాహాలకు కూడా తనవంతూ సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్తలు పాల్గొన్నారు.

వలస కార్మికులకు అండగా మజ్లిస్

గోల్కొండ: వలస కార్మికులకు మజ్లిస్ అండగా ఉంటుందని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్ హుస్సేన్ అన్నారు. బీహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందిన ఖరీం అనే వలస కార్మికుడు అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా నిరుపేద కుటుంబం కావడంతో అతడి అంత్యక్రియలు స్వగ్రామంలో జరిపిస్తామని మృతుడి బంధువులు మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీని కలిసి విన్నవించారు. దీంతో ఆయన సూచన మేరకు ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. ఇదిలాఉంటే చికిత్స సమయంలో తోటి కూలీలు అండగా ఉండి మానవత్వం చాటారని పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వేడుకల్లో రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి

రాజేంద్రనగర్: బుద్వేల్ భగవత్‌గూడలోని శ్రీ భవానీ శివసాయి అంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో పాటు సీనియర్ నాయకులు కొలన్ సుభాష్ రెడ్డి, దేవిరెడ్డి రాజు గోపాల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పచ్చ శ్రీనివాసులు, జేఏసీ అధ్యక్షుడు రమేశ్, తనీశ్ గౌడ్, అఖిలేష్, రాజేశ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సొంతఖర్చులతో పైపులైన్ మరమ్మతు

శంషాబాద్: పట్టణంలోని కొత్వాల్‌గూడలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సక్రమంగా కావడం లేదని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదు. ఇదే విషయాన్ని మున్సిపాలిటీ, మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేదు. దీంతో స్థానికులు సత్తయ్య, అంజయ్య, రవీందర్ యాదవ్ హనుమాన్ ఆలయ అధ్యక్షుడు రవీందర్ ముదిరాజ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సొంత ఖర్చులతో కంప్రెషర్లు పెట్టించి పైపులు తీయించి మరమ్మతులు చేయించాడు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు సమస్యలు విన్నవిస్తున్న నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేషన్ కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను ఆయన నివాసంలో బుధవారం కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, బోగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ‘కిడ్స్ సమ్మర్ క్యాంప్’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో కిడ్స్ సమ్మర్ క్యాంప్‌ను ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో స్వీయ చర్చా కార్యక్రమం, సృజనాత్మక ధ్యానం, విలువలతో కూడిన కార్యకలాపాలు, జ్ఞాపక శక్తిని పెంచుకోవడం, మైండ్‌ల్యాబ్, డిజిటల్ వెల్‌నెస్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో 9–14 ఏళ్ళ లోపు వారికి అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234, సెల్ నంబర్ 8143466670 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

కల్తీ మద్యం పట్టివేత

ఇద్దరి అరెస్ట్, కారు సీజ్

రాజేంద్రనగర్: ఢిల్లీ మద్యం బాటిళ్లలో కల్తీ మద్యం నింపి తక్కువ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న ముఠాను శంషాబాద్ డీటీఎఫ్, ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. రాజేంద్రనగర్‌లోని కాటేదాన్ ప్రాంతంలో జరుగుతున్న ఓ ఫంక్షన్ హాల్‌కు మద్యం దుకాణాల్లో లభించే ధరల కంటే దాదాపు రూ.500 నుంచి 1,000ల వరకు తక్కువకు మద్యాన్ని సరఫరా చేస్తామని ఓ ముఠా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు కారులో 4 కార్టన్లలో మద్యం సీసాలు తరలిస్తుండగా శంషాబాద్ డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరి నిందితులను పట్టుకుని వారి నుంచి ఢిల్లీకి చెందిన 72 బ్లాక్ లేబుల్ మద్యం బాటిళ్లు (54 లీటర్లు), కారు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. బ్లాక్ లేబుల్ మద్యాన్ని పరిశీలించగా అది ప్యూరియస్ లిక్కర్‌గా ఉందని గుర్తించారు. మద్యం, కారు విలువ రూ.20 లక్షలుగా ఉంటుందని అంచనా వేశారు. ఇలాంటి మద్యాన్ని కొనుగోలు చేసి కేసుల పాలు కావద్దని శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ పేర్కొన్నారు. డీటీఎఫ్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై జి.శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది ఫారూఖీద్దీన్, గణేశ్, నెహ్రూ, సాయి శంకర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ పి.దశరథ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ అభినందించారు.

గోల్కొండ ఇక నుంచి టోలిచౌకీ డివిజన్

గోల్కొండ: గోల్కొండ డివిజన్‌ను ఇక నుంచి టోలిచౌకీ డివిజన్‌గా పిలవాలని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు, పరిధి పునర్విభజన తదితర విషయాలను బుధవారం ఆయన వెల్లడించారు. పాత హుమాయూన్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలు టోలిచౌకీ స్టేషన్ పరిధిలోకి మార్చామన్నారు. అలాగే ఫిల్మ్‌నగర్ స్టేషన్ పరిధిలోని జానకీనగర్, సూర్యనగర్, బృందావన్ కాలనీ, అజీజ్‌బాగ్, సమత, పారమౌంట్ కాలనీ, న్యూ సమత కాలనీలే టోలిచౌకీ పరిధిలో కలిపామని తెలిపారు. అదేవిధంగా జమాలికుంట, రాఘవకాలనీ తదితర ప్రాంతాలను గోల్కొండ స్టేషన్ పరిధిలోకి తీసుకువచ్చామని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటైన టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌ను అజీజ్‌బాగ్ కాలనీలో ఏర్పాటు చేశామని త్వరలోనే దీనిని అధికారికంగా ప్రారంభిస్తామని తెలిపారు.

పీస్ కమిటీలను మరింత విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పీస్ కమిటీలను మరింత విస్తృత పరిధి బలోపేతం చేస్తామని టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సభ్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోల్కొండ లాంటి సున్నితమైన ప్రాంతంలో పీస్ కమిటీలు సమర్థవంతంగా పని చేస్తున్నాయన్నారు. కొత్తగా పోలీస్‌స్టేషన్లు ఏర్పడడం, కొన్ని స్టేషన్ల పరిధిలు మారడం వల్ల గోల్కొండ పీస్ కమిటీ సభ్యుల సంఖ్య తగ్గిందన్నారు. నూతన సభ్యులను తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా పీస్ కమిటీకి ఎన్నికలు నిర్వహించి నూతన బాడీని ఎన్నుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేంద్రప్రసాద్, పీస్ కమిటీ సభ్యులు మిర్జా ఎక్బాల్ అహ్మద్, పరమానందం, నర్సింగ్‌రావు, ఆబిద్, ఇలియాస్ అలీ, షకీల్ అలీఖాన్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు నూతన కేబుల్స్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



మైలార్‌దేవ్‌పల్లి: పద్మశాలీపురంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ‘కంచె కరువాయె’ అనే శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో బుధవారం కథనం ప్రచురితం కాగా, విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఉదయం ప్రమాదకరంగా కాలిన కేబుల్ వైర్లను తొలగించి నూతన వైర్లను ఏర్పాటు చేశారు. అలాగే త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయడంతో పాటు దిమ్మెలు వేసి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఆర్మీ స్పోర్ట్స్‌కు ముగ్గురు క్రీడాకారుల ఎంపిక



మణికొండ: పూణెలో ఇటీవల జరిగిన ఆర్మీ బాలబాలికల పోటీల్లో నార్సింగికి చెందిన ఫ్రెండ్స్ అర్చర్స్ అకాడమీ క్రీడాకారులు కె. పూర్ణచంద్, బాలికల విభాగంలో ఎం. సహస్ర రాణించి ఆర్మీ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్‌కు ఎంపికయ్యారు. గుంటూరు కేంద్రంగా జరిగిన ఎన్టీపీసీ అండర్– 10 జాతీయ ఆర్చరీ చాంపియన్ షిప్ పోటీల్లో నార్సింగికి చెందిన కె. రాజ్ బాలుర రికర్వ్‌బో విభాగంలో భారత ర్యాంకింగ్ విభాగంలో స్వర్ణపతకం, ఒలింపిక్ రౌండ్‌లో రజత పతకం సాధించాడు. దాంతో బుధవారం నార్సింగి మాజీ కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ వారిని అభినందించారు. కార్యక్రమంలో కోచ్ బండి స్వామి, క్రీడాకారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలించిన కమిషనర్



డ్రైనేజీ క్లీనింగ్ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ క్లీనింగ్ పనులను బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు డ్రైనేజీల్లో చెత్తచెదారం, వ్యర్థాలు వేయడం వల్లే డ్రైనేజీలు నిండి రోడ్లపై నీరు ప్రవహిస్తోందన్నారు. బండ్లగూడ జాగీరులో సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఆపరేటర్స్‌తో మేకనైస్డ్ అండర్ డ్రైనేజీ క్లీనింగ్ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమలో శానిటరీ జవాన్లు సురేశ్, రాము పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయ..100 శాతం ఉత్తీర్ణత

‘పది’లో టాపర్‌గా కార్తీక్ ఆనంద్



రాయదుర్గం: సీబీఎస్‌ఈ ఫలితాల్లో గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రియ విద్యాలయ వంద శాతం ఫలితాలు సాధించింది.పదవ తరగతి టాపర్‌గా కార్తీక్ ఆనంద్ 98.6 శాతం మార్కులు సాధించాడు. 10వ తరగతి, 12వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు సత్తా చాటారు. పదవ తరగతిలో మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. 37 మంది విద్యార్థులు 90 శాతం పైనే మార్కులు సాధించడం మరో విశేషం. అలాగే 12వ తరగతిలో 50 మంది విద్యార్థులు ఉండగా అందరూ ఉత్తీర్ణులయ్యారు.

మ్యాథ్స్, సైన్స్ ఇష్టం..



నాకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులు అంటే చాలా ఇష్టం . ఇంటర్మీడియట్‌లో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులను ఎంపిక చేసుకుంటా. మా తండ్రి నల్లతంబి బ్యాంకు ఉద్యోగి. కేంద్రీయ విద్యాలయలో 1వ తరగతి నుంచి చదువుతున్నాను, బోధనలో, క్రమశిక్షణ ఆచరించేలా ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్ చూస్తారు. నాకు ఫుట్‌బాల్ ఆడడం చాలా ఇష్టం.

– పదో తరగతి టాపర్ కార్తీక్ ఆనంద్

ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలతోనే..



ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదల, పోటీతత్వంతో చదవడంతోనే అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం కలిగింది. పది, ప్లస్2లో 100 శాతం ఫలితాలను ఆరంభం నుంచి సాధిస్తూ వస్తున్నాం.ప్రత్యేక తరగతుల నిర్వహణ ద్వారా మంచి ఫలితాలు సాధించాం. ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంది.

– జితేంద్రకుమార్, ప్రిన్సిపాల్, కేంద్రియ విద్యాలయం, గచ్చిబౌలి

విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యం

తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్



రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యమని తెలంగాణ 5వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాకేష్‌కుమార్ పేర్కొన్నారు. గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ఈ శిబిరాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమాజసేవ, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం లక్ష్యం అని అన్నారు. సైనికులకు ఇచ్చే తరహాలోనే శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణా శిబిరంలో రంగారెడ్డి జిల్లాకు చెందిన 600 మంది కాలేజీ విద్యార్థులు, 12 పాఠశాలలకు చెందిన క్యాడెట్లు పాల్గొంటున్నారన్నారు. ఈనెల 17వ తేదీ వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి లెఫ్టినెంట్ కల్నల్ లక్ష్మణ్, గణేష్, సబ్ మేజర్ కిషోర్ సింగ్ ఏఎన్‌ఓ ఆఫీసర్లు, సైనిక సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచొద్దని వినతి



నాంపల్లి: ఇంజినీరింగ్ కాలేజీల్లో కోర్సుల ఫీజులు పెంచి విద్యార్థులపై భారం మోపవద్దని, అలాగే అధ్యాపకులకు వేతనాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న ప్రైవేట్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తంకు టీపీటీఎల్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విజయ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం బుధవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉన్నత విద్యా మండలి చొరవ చూపి ఫీజుల పెంపును ఆపాలని డిమాండ్ చేశారు.